క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో వెలసిన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం హోమాలు, పూజలు నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, గంగపూజ, దేవనాంది, పంచగవ్య ప్రాసనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఉచిత కంటి పరీక్షలు

వాల్మీకిపురం: శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 105 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. 32 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్లు శ్రీధన్య, చాందిని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

వాల్మీకిపురం: యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ముస్లిం మత పెద్దలు అన్నారు. బుధవారం స్థానిక నాయక్‌వీధిలో ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన 400 మందికి డ్రైవర్ శ్రీరాములు సొంత ఖర్చులతో భోజన వసతి సమకూర్చినట్లు తెలిపారు. దీంతో ఆయనను ముస్లిం మత పెద్దలు సన్మానించారు. అనంతరం డాక్టర్ మస్తాన్ ఆధ్వర్యంలో 200 మంది చిన్నారులకు ఉచితంగా ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధిక్, షాహెద్, ఉల్లా, షఫి, అషర్, నూరుల్లా, కరీం, ఆబిద్, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నిమ్మనపల్లె : నిమ్మనపల్లెలో గురువారం మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా పర్యటిస్తారని ఎండీపీవో లీలామాధవి, ఏపీఎం రజనీ కుమారి తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు జడ్పీ హైస్కూల్ (తెలుగు) మైదానంలో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే హాజరై డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆస రా చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : కర్నాటక మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. బుధవారం పట్టణంలోని నక్కలదిన్నె ఆర్చ్ వద్ద కడప పట్టణం కో ఆపరేటివ్ కాలనీకి చెందిన సీవీ.సుబ్బారెడ్డి కుమారుడు సీవీ.సుధీర్‌కుమార్‌రెడ్డి (29) మారుతీకారులో అక్రమంగా నాలుగు కర్నాటక మద్యం ఫుల్‌బాటిల్స్ తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు.

అంకితభావం ఉండాలి

మదనపల్లె : ఉద్యోగ జీవితంలో బదిలీలు సర్వసాధారమని ఎక్కడ ఉన్నా ఉద్యోగులు వృత్తిపట్ల అంకితభావాన్ని కలిగి ఉండాలని టూటౌన్ సీఐ మురళీకృష్ణ అన్నారు. టూటౌన్ ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించి ఇటీవల రాయచోటి సీసీఎస్‌కు బదిలీ అయిన ఎస్ఐ చంద్రమోహన్‌కు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సీఐ మురళీకృష్ణ పోలీసు సిబ్బందితో కలిసి ఎస్ఐ చంద్రమోహన్‌ను సన్మానించారు.

నేడు మండల సమావేశం

రామసముద్రం: రామసముద్రం మండలం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ కుసుమకు మారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

గ్రామీణ బ్యాంకులో మెరుగైన సేవలు

గుర్రంకొండ: సప్తగిరి గ్రామీణ బ్యాంకు అన్ని ఆర్థిక రంగాల్లో తమ సేవలను అందిస్తోందని ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ రవిశంకర్ అన్నారు. బుధవారం స్థానిక తూముకుంట రోడ్‌లో ఉన్న సప్తగిరి గ్రామీణ బ్యాంకును గుర్రంకొండ కోట సమీపంలో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా రవిశంకర్ నూతన భవనానికి ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకుల్లో అన్ని రకాల రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రజలు బ్యాంకు సేవలను తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ప్రసాద్, బ్రాంచి మేనేజర్ వంశీకృష్ణ, సిబ్బంది మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సర్వభూపాల వాహనంపై వెంకటేశ్వరుడు

మదనపల్లె సిటీ : స్థానిక వేపళం వీధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు సర్వభూపాల వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో రమణ, ఆలయ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

అనిబిసెంట్ యూనివర్సిటీపై హర్షం

- పార్టీలకు అతీతంగా సీఎం, ఎంపీ, ఎమ్మెల్యేను ప్రశంసించిన నాయకులు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన పూర్వవిద్యార్థులు
- ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకుందంటూ అభినందనలు



అనిబిసెంట్ యూనివర్సిటీ ఏర్పాటుపై సీఎం, ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలుపుతున్న జనసేన నాయకులు గంగారపు రాందాస్ చౌదరి, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న వీసీకే పార్టీ, బాస్ నాయకులు

మదనపల్లె : మదనపల్లెలో డాక్టర్.అనిబిసెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలపడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రముఖులు, మేధావులు, పూర్వవిద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు బీటీ కళాశాలను యూ నివర్సిటీ స్థాయికి పెంచుతున్నందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాను ప్రశంసలతో ముంచెత్తా రు. బుధవారం పట్టణంలో పలుచోట్ల వివిధ పార్టీ లు, ప్రజాసంఘాల నాయకులు వేర్వేరుగా సమావేశమై ప్రజల చిరకాల కోరికను నెరవేర్చడంపై కృతజ్ఞతలు తెలిపారు.

- బీటీ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు మార్పూరి శశిధరరావు, జనసేన పార్టీ నాయకులు గంగారపు రాందాస్ చౌదరి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. రాయలసీమలో చారిత్రక నేపథ్యం కలిగి, మొట్టమొదటి కళాశాలగా పేరుమోసిన బీటీ కళాశాలకు పూర్వవైభవం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై అభినందనలు తెలిపారు. ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో కళాశాలను విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం ఆమోదం తెలపడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. బీటీ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పూర్వవిద్యార్థులుగా పార్టీలకు అతీతంగా తాము మద్దతు తెలుపుతున్నామన్నారు. ప్రజల బలీయమైన కోరికను నెరవేర్చినందుకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అనిబిసెంట్ సర్కిల్‌లోని అనిబిసెంట్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ వి.మధుసూధనరెడ్డి, గౌరవాధ్యక్షులు మార్పూరి సుధాకరనాయుడు, జాయింట్ సెక్రటరీ వేణుగోపాల్, లీగల్‌సెల్ అడ్వైజర్ జయనారాయణ రెడ్డి, రాజ్‌భవన్ రాజా, బోర్‌వెల్ సుధా, నారాయణ, రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.
- స్వాతంత్రోద్యమ సమయంలో మదనపల్లెలో విద్యావ్యాప్తిలో భాగంగా దివ్యజ్ఞాన సమాజం ఆధ్వర్యంలో బీటీ కళాశాలను బ్రిటిష్ వనిత అనిబిసెంట్ స్థాపించారన్నారు. మంచి ఆశయంతో ప్రారంభమైన బీటీ కళాశాల ఎందరినో ఉన్నతస్థానాలకు చేర్చేందుకు సహకరించిందన్నారు. మదనపల్లె ప్రజల మనస్సుల్లో అనిబిసెంట్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా యూనివర్సిటీని రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేస్తుండటంపై ప్రజాశాంతి పార్టీ అన్నమయ్యజిల్లా అధ్యక్షులు యం.భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.
- మదనపల్లెలోని చారిత్రక బీటీ కళాశాలను డాక్టర్. అనిబిసెంట్ యూనివర్సిటీగా మార్చేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వడంపై బాస్, వీసీకే పార్టీ రాష్ట్ర నేత పీటీయం.శివప్రసాద్ హర్షం ప్రకటించారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో వీసీకే పార్టీ నాయకులు రాయల్ సూర్య, బాస్ నాయకుడు రెడ్డిప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా కృషితో గతంలో మదనపల్లెకు మెడికల్ కళాశాల మంజూరైందని, ఇప్పుడు బీటీ కళాశాల యూనివర్సిటీ స్థాయికి మార్పు చేయడం సంతోషంగా ఉందన్నారు. మెడికల్ కళాశాల, యూనివర్సిటీలు పట్టణ అభివృద్ధికి దోహదపడుతాయన్నారు.

నర్సరీ లైసెన్సులు తీసుకోవాలి

బి.కొత్తకోట: నర్సరీలు ఏర్పాటుచేసుకునే యజమానులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం బి.కొత్తకోటలో ఆర్‌బీకే ఉద్యాన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ క్రాప్, ఈకేవైసీ, డ్రిప్‌సాగు, ఉద్యాన పథకాలు, నర్సరీల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నర్సరీ యజమాని.. రైతులకు నాణ్యమైన నారును, వాటికి బిల్లులు ఇవ్వాలన్నారు. మొక్కల విక్రయానికి సంబంధించిన రిజిస్టర్‌ను నిర్వహించాలని, సస్యరక్షణ వివరాలు, విత్తనాల కొనుగోలు రిజిస్టర్‌ను నర్సరీలను తనిఖీ చేసే సమయంలో అధికారులకు చూపాలన్నారు.

ములకలచెరువు: మండల వ్యాప్తంగా నడుపుతున్న నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌రెడ్డి యజమానులకు ఆదేశించారు. బుధవారం స్థానిక హార్టికల్చర్ కార్యాలయంలో మండలానికి చెందిన ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి నర్సరీ యజమాని రైతులకు నాణ్యమైన నార అందించాలని చెప్పారు. మొక్కల అమ్మకం రిజిస్టర్, విత్తన గొనుగోలు రిజిస్టర్, నర్సరీ తనిఖీ చేయు అధికారి రిజిస్టర్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆర్బీకే సిబ్బంది వీటన్నింటిని తనిఖీ చేయాలని చెప్పారు.

రేపు మండల సమావేశం

పీలేరు రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సామూహిక సీమంతం

మదనపల్లె : మండలంలోని వేంపల్లె సెక్టార్ పరిధిలోని కోళ్లబైలు పంచాయతీ బాబుకాలనీ –2 అంగన్‌వాడీ కేంద్రాన్ని సమగ్ర శిశు సంక్షేమశాఖ (ఐసీడీయస్) జిల్లా ఇన్‌చార్జి ధనలక్ష్మి ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. స్టాక్ బ్యాలెన్స్ తనిఖీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని గర్భవతులకు పీడీ ధనలక్ష్మి సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గర్భవతులు ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన సలహాలు అందించారు. అనంతరం ఎంఎస్‌కె సెంటర్‌ను సిబ్బందితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐగా చంద్రశేఖర్

రామసముద్రం: మండల ఎస్ఐగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తు న్న రవీంద్రబాబును పిటిఎం మండలానికి బదిలీ చేయగా, మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తు న్న చంద్రశేఖర్‌ను రామసముద్రంకు బదిలీ చేశారు.

ఆలయ నిర్మాణానికి ఎంపీ రూ.2 లక్షలు విరాళం

రామసముద్రం: రామసముద్రం మండలం ఎల్లవానెల్లూరు గ్రామంలో గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి బుధవారం రూ.2 లక్షలు విరాళం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. గతంలో రామసముద్రంకు విచ్చేసిన ఎంపీ మిథున్‌రెడ్డిని కలసి ఆలయ నిర్మాణం గురించి వివరించామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారంతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రూ.2 లక్షలు ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేసినట్లు తెలిపారు. గతంలో కూడ ఎంపీ ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేశారని చెప్పారు. ఎంపీ మిథున్‌రెడ్డి సహాయ సహకారాలకు నిర్వాహకులు సర్పంచ్ ఉదయ్‌శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కత్తివాలెప్ప, గంగప్ప, చంద్రప్ప, రాజప్ప, ఈశ్వర్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య పరీక్షలు

కలకడ : ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్‌కుమార్ రెడ్డి కోరారు. బుధవారం పాపిరెడ్డిగారిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లదే కీలకపాత్ర

– ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల అమలులో గ్రామ వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లది కీలకపాత్ర అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామవాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, గృహసారథులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేందుకు గ్రామవాలంటీర్లు బాధ్యతగా గుర్తించాలన్నారు. సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ గుర్రం పూర్ణ చంద్రిక, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, మాజీ జడ్పీటీసీ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చాను, సచివాలయ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ చాను, సర్పంచులు బయ్యారెడ్డి, బాషా, పద్మావతి, జయమ్మ, బీరంబీ, ఎంపీటీసీలు రుక్మాంగదరెడ్డి, జయరామ్, గీత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మహిళల ఆర్థిక అభివృద్ధి

తంబళ్లపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

మహిళలు ఆర్థిక అభివృద్ధిలో ముందడుగు వేశారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయితీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎర్రసానిపల్లె, వక్కావారిపల్లె, ఎగువముత్రవారిపల్లె, వసంతరాయులపల్లెల్లో ఇంటింటికీ వెళ్తూ ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించారు. పార్టీలకు అతీతంగా తమకు పథకాలతో రూ.లక్షలు అందాయని, టీడీపీ సానుభూతి మహిళలు తెలిపారు. అనంతరం ములపల్లెకు చెందిన ఆటో కార్మికుడు వెంకటాద్రి(57) అకస్మాతుగా మృతి చెందిన సంఘటన సమాచారం తెలియగానే ఎమ్మెల్యే ఆగ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సుగుణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, నాయకులు భద్ర, కరీముల్లా, గంట్ల సురేంద్ర, పద్మనాభరెడ్డి, ఎంపీడీవో ఆనంద్‌కుమార్, ఎంఈవో త్యాగరాజు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కలికిరిలో ఐదు పరీక్షా కేంద్రాలు

కలికిరి: ఈ నెల 10న జరుగనున్న పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షకు కలికిరిలో ఐదు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసినట్లు కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలో 400 మంది, సీకాం డిగ్రీ కళాశాల కేంద్రంలో 400 మంది, ఇండియన్ పబ్లిక్ స్కూల్ కేంద్రంలో 275 మంది, జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల కేంద్రంలో 200, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలో 120 మంది, మొత్తం 1395 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

గుడిబండ ఎంపీటీసీ సభ్యురాలు రాజీనామా

కలకడ : మండలంలోని గుడిబండ ఎంపీటీసీ సభ్యురాలు, మండల ఉపాధ్యక్షురాలు జల్లా క్రిష్ణకుమారి తన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. బుధవారం కలకడలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి ఆమోదించాలని చిత్తూరు జిల్లాపరిషత్ సీఈఓకు, కలకడ ఎంపీడీఓకు రాజీనామా లేఖ రిజిష్టర్ పోస్ట్ ద్వారా పంపినట్లు తెలిపారు.

వేసవి విరామ బైబిల్ పాఠశాల ప్రారంభం

కురబలకోట: మండలంలోని అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో డివిజన్ స్థాయిలో వేసవి విరామ బైబిల్ పాఠశాలను మదనపల్లె హెబ్రోన్ మందిర ప్రధాన దైవ సేవకులు ఇశ్రాయేల్ బుధవారం ప్రారంభించారు. తొలి రోజు వివిధ ప్రాంతాల నుండి 200 మందికి పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు విక్టర్ వేదనాయకమ్, దేవ దానం, ఏలియా, శ్యామ్యూల్, జయరాజ్, భాస్కర్, సంఘ కాపరి నాతానురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సాంకేతిక విద్యతో రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, విద్య పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఎంతటి ఉన్నత లక్ష్యాన్నైనా చేరుకోవచ్చన్నారు. చదివిన కళాశాల, తల్లిదండ్రులు, ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావడానికి విద్యార్థులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ప్రాంగణ ఎంపికల్లో ఎఫ్ట్రానిక్స్, ఫస్ట్ సోలార్ సిస్టమ్స్ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థినీ విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందచేసి అభినందించారు. అంతకుమునుపు కళాశాలలో నూతనంగా అందుబాటులోకి వచ్చిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అలాగే కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ఎంపీడీఓ గంగయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్



విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కుమార్ రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఈసీఈ, ఈఈఈ విభాగాధిపతులు శివరామక్రిష్ణ, సాంబశివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తరణ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

వాల్మీకిపురం: మదనపల్లి–తిరుపతి నాలుగు వరుసల జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. రహదారి విస్తరణకు మూడు సర్వేలను ఎన్‌హెచ్ అధికారులు నిర్వహించారు. అయితే రెండు, మూడు సర్వేల ప్రకారం తమకు చాలా నష్టం కలుగుతుందని, మొదటి సర్వే ఆధారంగానే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని గతంలో మండలంలోని టేకలకోన గ్రామస్తులు కలెక్టర్‌ను కలసి తమ గోడు చెప్పుకున్నారు. గ్రామస్తుల సమ్మతం ప్రకారం మొదటి సర్వే ఆధారంగానే విస్తరణ పనులను చేపట్టాలని ఎన్‌హెచ్ అధికారులకు కలెక్టర్ గిరీషా సూచించారు. అయితే గత రెండు రోజుల నుంచి ఎన్‌హెచ్ అధికారులు, 2, 3 సర్వేల ప్రకారం విస్తరణ పనులు చేపట్టారు. దీంతో బుధవారం టేకలకోన గ్రామస్తులు రోడ్డు పనులను అడ్డుకున్నారు. అనంతరం ఈ



పనులను అడ్డుకున్న టేకలకోన గ్రామస్తులు

విషయాన్ని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే పనులు ఆపాలని రైతు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

సీఎం జగన్ పాలనలో మదనపల్లె సర్వతోముఖాభివృద్ధి

– మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి



మదనపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మదనపల్లె నియోజకవర్గంలో సర్వతోముఖాభివృద్ధి జరుగుతోందని మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల కన్నా సంక్షేమంపై అధిక దృష్టి పెడుతోందన్న ప్రచారం జరుగుతోందన్నారు. అభివృద్ధి అంటే మౌలిక వసతుల కల్పన మాత్రమే కాదని, మానవ వనరులను అభివృద్ధి పరచడం అభివృద్ధి కిందకే వస్తుందన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ఠంచనుగా సంక్షేమ పథకాలను అమలుచేయడం వల్లే దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా 11శాతం వృద్ధి నమోదైందన్నారు. ప్రజల దగ్గర సంపద చేరడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా వ్యవస్థను నెట్టుకురాగలిగామన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి నాయకత్వంలో రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధిలో అన్నింటా అగ్రగామిగా నిలుస్తోందన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట కస్బాలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల కృతి తెలిపారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రాస్తారోకో

బి.కొత్తకోట: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని కోరుతూ బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు బి.కొత్తకోటలో రాస్తారోకో చేశారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సలీంబాషా, బషీర్‌ఖాన్, సమీవుల్లా, తంబయ్యశెట్టి, బాలకృష్ణ, జవహర్‌బాబు, గంగులప్ప పాల్గొన్నారు.

13న లోక్ అదాలత్

పీలేరు రూరల్ : ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులునాయక్ అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీ శారద, సీఐలు మోహన్‌రెడ్డి, గురుప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఫీఅన్సారీ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘ నాయకులపై ఎస్పీకి ఫిర్యాదు

పీలేరు : ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుపుతున్న తపస్య పాఠశాలపై లేనిపోని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులపై ఆ పాఠశాల యాజమాన్యం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. డీటీఎస్ఎఫ్ ఆర్గనైజేషన్ పేరుతో తప్పుడు ప్రకటనలు చేస్తూ తమ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పుడు సంకేతాలు ఇచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ అభివృద్ధి



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

పీలేరు : అటవీశాఖ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ అభివృద్ధి చేస్తున్నట్లు అడిషనల్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బి.కె. సింగ్ అన్నారు. బుధవారం పీలేరు రేంజ్ వగళ్ల బీట్ పరిధిలోని మార్లేళ్ల రిజర్వు కంపార్టుమెంట్ 4, గుర్రాలరేవు ప్రదేశంలో 20 హెక్టార్లలో మూడేళ్ల క్రితం నాటిన మొక్కలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 22,220 మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇందులో ఎర్రచందనం, ఎగిషా, వేప, మద్ది, నేరేడు తదితర మొక్కలు ఉన్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో విస్తృతంగా మొక్కలు అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాగేశ్వర్‌రావు, జిల్లా అటవీ అధికారి వివేక్, పీలేరు అటవీ క్షేత్రాధికారి బి. రామ్లానాయక్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.